క్లుప్తంగా

మహిళా సమాఖ్య సమావేశం

బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని మండల సమాఖ్య భవనంలో శుక్రవారం బోధన్ మండల మహిళ సమాఖ్య -1 సమావేశం, వార్షిక సభ నిర్వహించారు. ఈసందర్భంగా గత ఆర్థిక సంవత్సరం చేపట్టిన కార్యక్రమాలు సభ్యులకు వివరించారు. అనంతరం నూతన పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా పోషకళ, కార్యదర్శిగా ధనలక్ష్మీ, సహాయ కార్యదర్శిగా షేక్ ఖైరున్నీసా, కోశాధికారిగా కృష్ణకుమారిలను ఎన్నికయ్యారు. ఏపీఎం వినోద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా షీటీం కానిస్టేబుళ్లు విఘ్నేష్, సుమతి మాట్లాడుతూ.. పోకిరీలు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 8712659795, 100 కు డయల్‌కు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు అన్నారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం వైద్యులతో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వైద్యులు అందుబాటులో ఉంటారని, అవసరమైన అన్ని రకాల మందులు ఉన్నాయన్నారు. వైద్యులు అజయ్, సుమన్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

పోతంగల్(రుద్రూర్): గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పోతంగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి కరణ్ సూచించారు. పోతంగల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుష్మాన్ భవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, హెల్త్ సూపర్ వైజర్లు జ్యోతి, సాయికుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మెల్యే షకీల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని అయేషా వేల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ అయేషా ఫాతీమా అన్నారు. పట్టణంలోని ఎంవీఐ కార్యాలయానికి శుక్రవారం ఆమె వచ్చి డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు రవిశంకర్ గౌడ్, నరేష్, ముబీన్, బోదు శంకర్ ఉన్నారు.

పొదుపు సంఘాలకు రూ.30 కోట్ల రుణాలు

వర్ని: మండలంలో 538 డ్వాక్రా సంఘాలకు రూ. 30 కోట్ల రుణాలను పంపిణీ చేశామని ఐకేపీ ఏపీఎం ప్రసాద్ వెల్లడించారు. వర్ని మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం శుక్రవారం అధ్యక్షురాలు పుష్ప నిర్వహించారు. సమాఖ్య గత వార్షిక వివరాలను వివరించారు. ఎంపీడీవో బషీరుద్దీన్ ,ఎమ్మార్వో నారాయణ, సీసీలు పుల్ సింగ్, చిన్న గంగారాం,తుకారం పాల్గొన్నారు.

ఈ కేవైసీ చేయించుకోవాలి

వర్ని: రేషన్ కార్డు ఉండి రేషన్ తీసుకుంటున్న వినియోగదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అతిమల నగేష్ కోరారు. వర్నిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డులో ఉన్న ప్రతి వ్యక్తి రేషన్ డీలర్ వద్ద వేలిముద్ర, ఐరిస్ ద్వారా ఈ కేవైసీ చేసుకోవాలని సూచించారు.

కేసులు తీసివేయించాలి

కమ్మర్‌పల్లి: బీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే గ్రామస్తులపై నమోదైన కేసులను మంత్రి ప్రశాంత్‌రెడ్డికి చెప్పి తీసివేయించాలని మండలంలోని హాసకొత్తూర్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి నిరసన దీక్షకు సంఘీభావం తెలిపి, కేసు బాధితులకు అండగా నిలిస్తే, బీఆర్ఎస్ నాయకులు మంత్రి మెప్పుకోసం ఆయనను విమర్శించడం సిగ్గుచేటన్నారు. నాయకులు పడిగెల ప్రవీణ్, కుందేటీ శ్రీను, గోపిడి లింగారెడ్డి పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



రుద్రూర్: తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 25నుంచి సీఐటీయు ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నట్టు కోటగిరి ఉమ్మడి మండల ఆశా కార్యకర్తలు తెలిపారు. ఈమేరకు సమ్మె నోటీసును శుక్రవారం పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో గోవర్ధన్‌కు అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, ఆశా కార్యకర్తలు అనురాధ, రేష్మ, సుజాత, స్వప్న, లత, గంగా, స్రవంతి పాల్గొన్నారు

జోరుగా పేకాట

- డొంకేశ్వర్ మండలంలో నిర్మానుష్య ప్రాంతాలే అడ్డాలు
- నిఘా పెట్టని పోలీసులు



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేకాట జోరుగా నడుస్తోంది. స్థానికంగా పోలీస్ స్టేషన్ లేకపోవడంతో పేకాట రాయుళ్లకు కలిసొచ్చింది. నందిపేట పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో జూదం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎవరూ సంచరించని ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండలంలో రెండు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పలువురిని పట్టుకున్నారు. ఎక్కడి నుంచో వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరాలను గుర్తిస్తున్నా, స్థానిక పోలీసులు మాత్రం గుర్తించలేకపోతున్నారు.

గతంలో టాస్క్‌ఫోర్స్ దాడులు..

మూడు నెలల క్రితం టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తొండాకూర్ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. అలాగే వారం క్రితం నికాల్‌పూర్ శివారులో కూడా టాస్క్‌ఫోర్స్ పోలీసులే దాడి చేయగా కొంతమంది పరారీ కాగా, ఇద్దరు వ్యక్తులను పట్టుకుని కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సారెస్పీ శివారు ప్రాంతాల్లో, తోటల్లో కూడా పేకాట నిత్యకృత్యంగా నడుస్తోంది. పోలీసులు వస్తే దొరక్కుండా అడ్డాలను మారుస్తున్నారు. పేకాట ఆడే వారిలో ప్రముఖులతో పాటు యువకులు కూడా ఉంటున్నారు. జూదాన్ని ఆడుతున్న చాలమంది వేలు, లక్షల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. వ్యసనంగా మారడంతో చాల మంది అప్పుల పాలైనట్లు కూడా తెలుస్తోంది. పోలీసులు నిరంతర నిఘా పెడితే తప్ప పేకాటకు కళ్లెం పడే పరిస్థితి కనిపించడం లేదు.

మండలంలో పోలీస్‌స్టేషన్ లేక..

డొంకేశ్వర్ కొత్త మండలంగా ఏర్పడి దాదాపు ఏడాది కావస్తోంది. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కాకపోవడంతో నందిపేట పోలీసులే మానిటరింగ్ చేస్తున్నారు. పది కిలో మీటర్ల దూరంలో ఉన్న డొంకేశ్వర్ మండలానికి వచ్చి పెట్రోలింగ్ చేయడానికి కొంత ఇబ్బందిగానే మారింది. కనీసం రోడ్డుపై పోలీసు వాహనం కనిపించినా పేకాట ఆడేందుకు భయపడేవారని పలువురు పేర్కొంటున్నారు. మండలంలోని నాలుగైదు మేజర్ గ్రామ పంచాయతీల పరిధిలో ఈ పేకాట జోరుగానే నడుస్తోంది. రాత్రుల్లో ఏకంగా లైటింగ్ ఏర్పాటు చేసుకుని మరీ పేకాట ఆడుతున్నారు. ఒక్కో అడ్డాలో పదిమందికి తగ్గకుండా పేకాటరాయుళ్లు ఉంటున్నారు. అక్కడే మద్యాన్ని కూడా సేవిస్తున్నారు.

నిఘా పెంచుతాం...



నందిపేట్ మండలంలోనే పెట్రోలింగ్ చేయడానికి సమయం సరిపోవడం లేదు. తద్వారా కొత్తగా ఏర్పడిన డొంకేశ్వర్ మండలంలో రోజూ పోలీస్ పెట్రోలింగ్ చేయడం సాధ్యం కావడం లేదు. ఈ ప్రాంతంలో పేకాట ఎక్కువ జరుగుతుందని సమాచారం ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాలను తీసుకుని డొంకేశ్వర్ మండలంలో నిఘా పెంచుతాం. రాత్రుల్లో పెట్రోలింగ్ వాహనాన్ని తిప్పుతాం. – రాహుల్, ఎస్సై, నందిపేట్

విఘ్నేశ్వరుడికి ఘనమైన పూజలు





ఆర్మూర్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు.. అంబం (ఆర్)లో శోభాయాత్రలో యువతుల నృత్యాలు

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బోధన్/రెంజల్/బోధన్ టౌన్/వర్ని/మాక్లూర్/ఎడపల్లి/నవీపేట: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా శుక్రవారం పలు గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు, అన్నదానాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పలు గ్రామాల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. బోధన్ నియోజకవర్గంలోని పలు గణేశ్ మండపాలకు ఎమ్మెల్యే షకీల్ నగదు, అన్నదానాల కోసం బియ్యంను సతీమణి అయేషా ఫాతిమా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాల్లో ఫాతిమా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





గణేష్ మండపాలకు విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఫాతిమ.. కల్యాపూర్ గ్రామంలో..



వల్లభాపూర్‌లో అన్నదానం..



చందూర్‌లో..

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేస్తున్న నాయకులు

ఆర్మూర్: ఇటీవల తుక్కుగూడ బహిరంగ సభలో అభయహస్తం పేరుతో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి బాటలు వేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో శుక్రవారం గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మానాల, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహర్‌బిన్ హందాన్‌తో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఫత్తేపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నాయకులు మార చంద్రమోహన్, గోర్తె రాజేందర్, కోల వెంకటేష్, అశోక్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, ఇట్టెం జీవన్, ప్రమోద్, చిన్నారెడ్డి, మహిపాల్, భూమేశ్వర్, రవి ప్రకాష్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి



సంపద వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బాల్కొండ: ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ వారితో కలిసి పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్ అన్నారు. మండలంలోని బస్సాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సంపద వనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. మొక్కల పెంపకం వేగవంతం చేయాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై పంచాయతీ కార్యదర్శిలతో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలను పెంచేల ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 986 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేసేల లక్ష్యం ప్రభుత్వం విధించిందన్నారు. అందుకు అనుగుణంగా గ్రామాల్లో రైతులతో మాట్లాడి చైతన్యం చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీవో ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మక్కలు, సోయాలు కొనుగోలు చేయాలి..

బాల్కొండ: మహిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా వచ్చే సీజన్‌లో సోయా, మక్కలను కొనుగోలుచేయాలని డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్ సూచించారు. బాల్కొండలో ఆయన శ్రీరాంసాగర్ రైతు ఉత్పత్తుల సంస్థ బీవోడీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తుదారుల సంస్థ ద్వారా వ్యాపారం ఎలా అభివృద్ధి చేయాలో వివరించారు. ఏపీడీ మధుసుధన్, ఏపీఎంలు గంగాధర్, ప్రసాద్‌రావు, విక్రమ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

క్రీడా దుస్తుల వితరణ

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు శుక్రవారం ఎంపీటీసీ పిప్పెర అనిల్ రెడ్డి క్రీడా దుస్తులను వితరణ చేశారు. నాయకులు చిన్నారెడ్డి, అవారి మురళి, కొమ్ముల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం ప్రారంభం

ఆర్మూర్: పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో శుక్రవారం ఉచిత ఫిజియోథెరపీ శిబిరం ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యులు దివ్యాంగ చిన్నారులకు ఫిజియో థెరపీ చికిత్సను అందించారు. ఎంఈవో రాజగంగారాం, కేంద్రం సిబ్బంది కిషన్, అలేఖ్య పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు వితరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శుక్రవారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి వాటర్ ప్లాంటును అందజేశారు. సర్పంచ్ నీరడి రాజేశ్వర్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

వర్ని: మండలంలోని కూనిపూర్ గ్రామంలో శివాలయం నిర్మాణానికి మల్లారం పిట్లకృష్ణ మహారాజు శుక్రవారం భూమిపూజ చేశారు. రూ. 35లక్షల వ్యయంతో ఆలయాన్ని నిరించనున్నారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బాల్కొండ: ముప్కాల్‌లో శుక్రవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ, క్షీరాభిషేకం నిర్వహించారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను శుక్రవారం ఎంపీపీ సామ పద్మ పంపిణీ చేశారు. తహసీల్దార్ వనజారాణి, మునీరొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన సూర్యవంశ అమోస్ ఇటీవల మృతిచెందాడు. దీంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించి, ఆర్థిక చేయూత అందించారు. మృతుడి పిల్లలిద్దరి పేరిట రూ. 50వేలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

నియామకం

రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి రామాలయం కమిటీ చైర్మన్‌గా పెద్దోల్ల సుధాకర్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత కమిటీ పదవీకాలం పూర్తవడంతో శుక్రవారం రామాలయంలో గ్రామస్తులు సమావేశమై చైర్మన్‌గా సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

చర్యలు తీసుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వాఖ్యలు చేసిన బోడ రాజుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నియోజవర్గ నాయకులు పాండు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛతా హీ సేవాపై అవగాహన

వర్ని/మాక్లూర్/బాల్కొండ: వర్ని, మాక్లూర్, బాల్కొండ సహా పలు మండలాల్లో అధికారులు, విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. మాక్లూర్‌లో ర్యాలీ నిర్వహించారు.

బోరుబావి తవ్వకం

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ గ్రామంలో శుక్రవారంజీపీ నిధుల ద్వారా బోరుబావిని తవ్వించారు. సర్పంచ్ నేల్లా లావణ్య, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య మహాసభ



ఎడపల్లి(బోధన్): మండల మహిళా సమాఖ్య 15వ వార్షిక మహా సభను శుక్రవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మన్యం శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. మండలంలోని వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొని గత ఏడాది కాలంగాసమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన లావాదేవీలను వివరించారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టబోయే కార్యక్రమాలను తెలియజేశారు.

తెలంగాణకు పెద్ద దిక్కు కేసీఆర్

- ప్రభుత్వ సంంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంబురం
- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



కోనాసముందర్‌లో శంకుస్థాపన చేస్తున్న మంత్రి

కమ్మర్‌పల్లి: తెలంగాణ రాష్ట్రానికి పెద్ద దిక్కు కేసీఆర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంబురం నెలకొందన్నారు. మండలంలోని కోనాసముందర్, నర్సాపూర్, ఇనాయత్‌నగర్, అమీర్‌నగర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన రూ. 9.02 కోట్ల అంచన వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ ఇప్పుడు ఇస్తున్న సంక్షేమ పథకాలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో బాల్కొండ నియోజకవర్గాన్ని రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు ఇంద్రాల రూప, లస్కర్, గంగాధర్, ప్రభాకర్, సొసైటీ చైర్మన్‌లు సామ బాపురెడ్డి, రేగుంట దేవేందర్, నాయకులు గుడిసె అంజమ్మ, శేఖర్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్‌లో పలువురు యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

హెల్మెట్లు పంపిణీ..

వేల్పూర్: మంత్రి ప్రశాంత్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో డ్రైవింగ్ లైసెన్సులు పొందిన యువకులకు శుక్రవారం వేల్పూర్‌లో హెల్మెట్లు పంపిణీ చేశారు. సుమారు 400 మంది యువకులకు హెల్మెట్లు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు రేగుల్లరాములు, భీమ రాజేందర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ బీజేపీ



బోధన్‌టౌన్(బోధన్): ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి వెల్లడించారు. పట్టణంలోని 38వ వార్డులో శుక్రవారం పార్టీ శ్రేణులు ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ప్రారంభించి, నిర్వహించారు. అనంతరం వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను నేతలకు వెల్లడించారు. ఈసంధర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు విన్నవిస్తామని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు వడ్డి మోహన్‌రెడ్డి, వినోద్, సుధాకర్‌చారీ, బాలరాజు, ఇంద్రకరణ్, గోపికృష్ణ, మనోహర్, రంగారావు, మేకసంతోష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె



డొంకేశ్వర్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజు కొనసాగింది. డొంకేశ్వర్‌లో అంగన్‌వాడీ టీచర్లు ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి, నిరసన తెలిపారు. రుద్రూర్‌లో అంగన్‌వాడీ ఉద్యోగులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మండల సమీకృత భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

లాభాలు రావట్లేదు..



రెంజల్(బోధన్): లక్షల ఖరీదు చేసి కొనుగోలు చేసిన వరి కోత యంత్రం ద్వార అప్పులు తప్పా లాభాలు రావట్లేదని ప్రజాప్రతినిధులు, అధికారులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. రెంజల్‌లోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య 17వ మహాజన సభను నిర్వహించారు. అకౌంటెంట్ సంవత్సరపు లావాదేవీలను వివరించారు. గత మూడు సీజన్‌లుగా వరి కోత మిషన్ నడుపుతున్నా రూ. 6 లక్షల అప్పులు ఎలా అవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల వద్ద సుమారు 3 లక్షల రూపాయలు రావాల్సి ఉందని సిబ్బంది సమాధానం చెప్పారు. అయినా మరో మూడున్నర లక్షలు ఎమాయ్యాయని ప్రశ్నించారు. పది రోజుల్లో పూర్తి లెక్కలు చూపాలని ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ విజయ, రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్, ఎంపీడీవో శంకర్ సిబ్బందిని ఆదేశించారు. వనిత గ్రామ సంఘంలో సుమారు రూ.7 లక్షల వరకు లెక్కలు చూపడంలేదని మండిపడ్డారు. అందుకు సంబంధించి సమావేశంలో తీర్మానం చేయాలని, లేదంటే జిల్లా అధికారులను ఆశ్రయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సాటాపూర్‌లో మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ

రెంజల్(బోధన్): ప్రజలు పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో శుక్రవారం ఆయన మండల స్థాయి శాంతి కమిటీ సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గణేశ్, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా ఇరు వర్గాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. రూరల్ సీఐ శ్రీనివాస్ రాజు, ఎస్సై ఉదయ్‌కుమార్, సర్పంచ్‌లు మర్ల రమేశ్‌కుమార్, ఎఖార్‌పాష, గణేశ్‌నాయక్, పాముల సాయిలు తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్లో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం రోజు అందరూ ఐకమత్యంగా ఉండి ఒకరినొకరు సహకరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు మాట్లాడుతూ.. నిర్వాహకులు నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని కోరారు. అధికారులు ప్రసాద్ చౌహాన్, శ్రీధర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్/కోటగిరి/బోధన్‌టౌన్: ఎండీఎం కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎండీఎం(సీఐటీయూ) ఆర్మూర్ మండల కార్యదర్శి జక్కం సుజాత అన్నారు. ఆర్మూర్‌లో తహసీల్దార్ శ్రీకాంత్‌కు, ఎంఈవో కార్యాలయంలో లతకు ఈనెల 28 నుంచి సమ్మెకు వెళుతున్నట్లు శుక్రవారం ఎండీఎం కార్మికులు సమ్మె నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండీఎం కార్మికుల రావాల్సిన బకాయి వేతనాలు విడుదల చేయాలన్నారు. బోధన్‌లో ఎండీఎం కార్మికుల సమ్మె శుక్రవారం మూడోరోజు కొనసాగింది. కోటగిరిలో ఎండీఎం కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా నాయకులు విఠల్‌గౌడ్ మద్దతు ప్రకటించారు.



■ నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు డీఈఈ హరిచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండనున్నట్లు తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	అష్ట దిగ్బంధనం - 1.00; ఖుషి - 3.55 సప్త సాగరాలు దాటి - 7.20 7/జీ బృందావన కాలనీ - 10.25
స్క్రీన్-2 –	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 –	7/జీ బృందావన కాలనీ - 01.10 మట్టి కథ - 4.40; టీటర్ - 10.00 మార్క్ ఆంథోనీ - 6.50
స్క్రీన్-4 –	జవాన్(తెలుగు)- 11.00, 2.35, జవాన్(హిందీ)- 6.10, 9.45